తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

మహాపూర్ణాహుతితో

## ముగిసిన పవిత్రోత్సవాలు



కపిలేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాలు శనివారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ అర్చకులు వేదోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభాతవార్త-తిరుపతి

## శ్రీవారి సేవలో హోమ్‌మంత్రి అనిత



రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శనివారం ఉదయం కుటుంబంతో కలసి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు ప్రభాతవార్త-తిరుమల

# పక్కాగా పారిశుధ్య నిర్వహణ

- రోజుకు రెండు పంచాయతీలు ఇఓఆర్డీలు విధిగా పరిశీలన
- సచివాలయ ఉద్యోగులపై ఎంపిడిఓలు పర్యవేక్షణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు టౌన్, జులై 20 ప్రభాతవార్త

గ్రామ స్థాయిలో సమర్థవంతమైన పాలనలో భాగంగా పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి సరఫరా, అక్రమ లేఅవుట్ల కట్టడి, పన్నుల వసూళ్ళు, సచివాలయ సిబ్బంది హాజరు తదితర అంశాలపై ఎంపిడి ఓలు, ఇఓపిఅర్డీలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఇఓపి అర్డీలు, అర్‌డబ్ల్యుఎస్ ఎఇలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల కట్టడికి తీసుకొంటున్న చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అందుబాటులో వున్న అన్ని వనరులను వినియోగించుకొని పల్లెలను పారిశుధ్యంగా వుంచాలని ఆదేశించారు. అలాగే సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మంచినీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నీరు కలుషితం అయితే ఈ వ్యాధులు వ్యాప్తిచెందుతాయనే విషయంను అధికారులు గుర్తించాలన్నారు. పంచాయతీల పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు అందుబాటులో వున్న నిధుల నుండి జీతాలు చెల్లించాలని, ఈ విషయంలో సర్పంచ్‌లతో పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకొని జీతాల ప్రక్రియ సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిడిఓలు, ఇఓపిఆర్డీలు విధిగా గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు మున్సిపాల్టీల్లో తరహా గ్రామాల్లో ప్రతి రోజు ఉదయం పారిశుధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టళ్ళలోని మంచినీటి ట్యాంకులను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేయడంతో పాటు పైప్‌లైన్ లీకేజీలపై చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధులను కొంతవరకు కట్టడి చేయవచ్చునన్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్లు సిబ్బందిని సమన్వయం చేసుకుని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా సీజనల్ వ్యాధులు నమైదైన వెంటనే మండల, గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తమై కట్టడికి చర్యలు చేపడితే వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చునన్నారు. సచివాలయ వ్యవస్థలో విధులు నిర్వర్తించే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, సమయ పాలన ప్రతి రోజు ఎంపిడిఓలు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ గ్లోరియా, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ విజయకుమార్, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆగిన బిల్లులు - సాగని పనులు

## ముంచుకొస్తున్న వానలు .. ఆందోళనలో రైతులు





అర్థాంతరంగా ఆగిన వాలగల మంద ప్రాజెక్టు, వాలగల మంద దృశ్యం

**శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయక ప్రధాన ప్రాంతం. ఇక్కడి వ్యవసాయం కేవలం చెరువులు, బోర్లు మీద ఆధారపడి సాగుతుంది. సుమారు 32వేల హెక్టార్లు వ్యవసాయం సాగుతుంది. ఇక్కడ వ్యవసాయం కేవలం నాడు రాజులు ఏర్పాటు చేసిన చెరువుల మీద ఆధారపడి సాగుతుంది.ఈ నియోజకవర్గంలో లింక్ చెరువులు. తొండమనాడు చెరువు నుంచి సుమారు పది చెరువులకు సాగునీటిని అందిస్తారు. ఈ నియోజకవర్గం రైతుల సంక్షేమం దృష్ట్యా దీర్ఘకాలం ఈ నియోజకవర్గాన్ని పరిపాలించిన గోపాల కృష్ణారెడ్డి జన్మభూమి కార్యక్రమాల్లో మరమ్మత్తులు చేయించారు. తరువాత 20 సంవత్సరాలుగా తట్టెడు మట్టి పోయలేదు.గత ఐదేళ్ళులో చెరువుల మీద ఒక్క పైసా కూడా వెచ్చించలేదని అధికారులు తెలపటం గమనించదగ్గ విషయం**

శ్రీకాళహస్తిరూరల్, జూలై 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చెరువుల పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించి ఐదేళ్ళ నుంచి నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయానికి సంబంధించిన భారీ ప్రాజెక్టుల్లేదు. కానీ ఉన్న వనరులకు నిధుల కొరత శ్రీకాళహస్తి స్వర్ణముఖి ఆనకట్ట అభివృద్ధికి రూ.40కోట్లతో చేపట్టిన పనులు ప్రారంభం కాలేదు. టెండర్ ఖరారు చేసారు.కానీ కాంట్రాక్టర్ ప్రభుత్వం మారటంతో డోలాయమాన స్థితిలో ఉన్నారు. అయితే పనులు ప్రారంభించుటకు అధికారులు కాంట్రాక్టర్‌ను బుజ్జగిస్తున్నారు. ఇక ఎస్‌ఎస్‌కెనాల్ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. సుమారు పాతికేళ్ళుగా ఈ ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ కాలువ నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టింది.ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పరిస్థితి ఎటూ కాకుండా ఉంది.ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అతి పెద్ద చెరువు 'తొండమనాడు చెరువు' ఈ చెరువు అధికారికంగా నాలుగువేల ఎకరాలకు సాగునీరందిస్తుంది. అంతేకాక శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు, అక్కూర్తి, అరవ కొత్తూరు చెరువులతో పాటు మరికొన్ని చెరువులకు సాగు నీరందిస్తుంది.అయితే ఈ చెరువు మరమ్మతులకు రూ.3కోట్లతో పనులు చేపట్టుటకు నిర్ణయించారు. టెండర్ నిర్వహించి పనులు చేపట్టారు. అయితే ఆతనికి రూ.1కోటి రూపాయలు బిల్లులు చెల్లించ లేదు. దాంతో కాంట్రాక్టర్ చేతులేత్తేసారు.ఇక మరో ప్రాజెక్టు వాలగల మంద. ఈ ప్రాజెక్టును రూ.1.5కోట్లతో పనులు చేపట్టారు. రూ.50 లక్షల బిల్లులు పెండింగ్ పెట్టారు.దాంతో ఆ కాంట్రాక్టర్ పనులు ఆపేసారు.పనులు ఆపివేయటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

### తరుముకొస్తున్న వానలు:

శ్రీకాళహస్తి మండలంలోని చెరువుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐదేళ్ళుగా చెరువుల మీద పాలకులు దృష్టి పెట్టకపోవటంతో ఏ చెరువు ఎలా ఉందో అర్థం కాని పరిస్థితి.వర్షాలు తరుముకొస్తున్నాయి. గతంలో కన్నా ముందుగా వస్తున్నాయి. వచ్చిన నీటిని ఎలా కాపాడుకోవాలో తెలియని స్థితి చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికారులు ముందుజాగ్రత్త తీసుకోవాల్సి ఉంది. లేదంటే పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.అయితే ఇటీవల నిర్వహించిన ఇరిగేషన్ శాఖ సమీక్షలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సమగ్ర నివేదికలను ఇవ్వాలని కోరారు.ఇతర ప్రాధాన్యతనలను పక్కన పెట్టి ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబందించి చొరవ చూపాల్సి ఉంది.

# తిరుమలలో నాణ్యతాప్రమాణాలకు ప్రాధాన్యత

-అన్నప్రసాదం... లడ్డూలు నాణ్యతగాతయారీ

-హోటళ్ళు సబ్‌లీజుకు ఇస్తే చర్యలు -నెలరోజుల పాలనపై టిటిడి ఈఓ శ్యామలరావు



తిరుమల,జులై 20 ప్రభాతవార్త

భక్తులకు కనీస సౌకర్యాలు మెరుగుపరచడంతోబాటు అన్నప్రసాదాలు, స్వామివారి నైవేద్యప్రసాదాల తయారీ, లడ్డూల నాణ్యతప్రమాణాలు పెంపొందించడమే ప్రాధాన్యతగా తీసుకున్నట్లు టిటిడి ఈఓ జె.శ్యామలరావు ఉద్ఘాటించారు. అన్ని చోట్లా నాణ్యతకు పెద్దపీట వేసి, ఆ దిశగా మార్పులు తీసుకువచ్చినట్లు చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ,నాణ్యతా ప్రమాణాలతో అన్నప్రసాదాలు, స్వామివారికి నైవేద్యప్రసాదాలు తయారీలో రాజీలేని ధోరణి అవలంభిస్తున్నట్లు స్పష్టం చేశారు. టిటిడి ఈఓగా బాధ్యతలు చేపట్టిన జె.శ్యామలరావు తననెలరోజుల పాలనపై, భక్తులకు సౌకర్యాల మెరుగుపరచడంపై శనివారం గోకులం విశ్రాంతి భవనంలో మీడియా ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చించారు. టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితోకలసి ఈఓ అభిప్రాయాలతో బాటు సూచనలు తీసుకున్నారు.తిరుమల పవిత్రతను కాపాడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రక్షాళన చేపట్టానన్నారు.భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో క్షేత్రస్థాయిలో పరిశీలన దోహదపడిందన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించడానికి సంబంధించిఉదయం అల్పాహారం, మధ్యాహ్నం,రాత్రి భోజనాలలో భక్తులకు అందించాల్సిన ఆహారపదార్థాలను నిర్ణయించినట్లు ఈఓ చెప్పారు.

## తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా నారపరెడ్డి మౌర్య



తిరుపతి కార్పొరేషన్, జులై 20, ప్రభాతవార్త: తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మౌర్య కర్నూల్ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

# గంజాయి పట్టివేత

## ముగ్గురు అరెస్ట్



గూడూరు, జులై 20, ప్రభాతవార్త

క్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన గూడూరు జాతీయ రహదారి పోటుపాలెం జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. శనివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఒడిస్సా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేశారన్నారు. వీరు ఒడిస్సా నుండి గూడూరుకి రైలులో వచ్చి గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగారన్నారు. అక్కడి నుండి చెన్నైకి వెళ్ళుటకు ఆటోలో గూడూరు జాతీయ రహదారి కూడలిలో చేరుకున్నారన్నారు. వాహనాల సాధారణ తనిఖీల్లో భాగంగా వారిని గూడూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 22 కేజీల గంజాయి, 3 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ 2 లక్షల 50 వేల రూపాయిలు ఉంటుందన్నారు. ఎవరైనా క్రమంగా గంజాయి విక్రయించిన, తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ మనోజ్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో భక్తుల రద్దీ





కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయం శనివారం రికార్డు స్థాయిలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి అనూహ్యంగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ పరిసరాలన్నీ కిటకిటలాడాయి. ప్రభాతవార్త, కాణిపాకం

# రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్పీ



చిత్తూరు టౌన్, జులై 20 ప్రభాతవార్త:

రోడ్డు భద్రతా నియమాలు పక్కాగా పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ మణికంఠ చందోలు స్పష్టం చేశారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో పోలీసులు శనివారం సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 110 వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంను పర్యవేక్షించిన ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ రోడ్డు భద్రతా అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించడం అనివార్యమన్నారు. ప్రతి వాహనానికి సరైన నెంబర్‌ప్లేట్లు, సక్రమమైన వాహన పత్రాలు వుండటం అత్యంత అవసరం అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారి వాహనాలను స్వాధీనం చేసుకోవడం లేదా వారికి చట్టపరమైన శిక్షలు విధించడం జరుగుతుందన్నారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొంతమంది నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు వినియోగిస్తున్నారని, ఆ వాహనాలను గుర్తించకపోవడం వల్ల అవి దొంగతనంకు గురయ్యే అవకాశం వుందన్నారు. దొంగతనం జరిగిన వాహనంను ఎవరైనా దుర్వినియోగం చేస్తే ఆ వాహన యాజమాని అనవసరంగా సమస్యలు ఎదుర్కోవాల్సివస్తోందన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాల్లో హెల్మెట్, సీట్ బెల్ట్ కీలకమన్నారు.

# నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం?

## చెవిరెడ్డిని హెచ్చరించిన పులివర్తి సుధారెడ్డి



తిరుపతి హెల్త్, జులై 20, ప్రభాతవార్త

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జగన్‌కి చెవిలో పువ్వు పెట్టింది చాలదా.. పదే పదే మాపై అబద్ధాలు చెప్పడం ఎందుకు అని ఇంకొక్కసారి తమ కుటుంబం పై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోమని, నువ్వు చేసే తప్పులకే నీ బిడ్డలు బలి అవుతున్నారు తెలుసా అని, ఏదైనా ఉంటే అదే ప్రెస్ క్లబ్ డిబేట్‌కి మీరు సిద్ధమా చెవిరెడ్డి అంటూ చంద్రగిరి ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. ఆమె ప్రెస్ క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మానసిక స్థితి సరిగా లేదని, ఆయన చేసిన ఆరోపణలు అన్ని అబద్ధపు ఆరోపణలు అని చెప్పారు. తాము గత 25 సంవత్సరాలుగా క్వారీ వ్యాపారం చేస్తూనే ఉన్నామన్నారు. ప్రజా సేవపై వున్న ఆసక్తితో రాజకీయాలలోకి వచ్చిన నాని వ్యాపారం పూర్తిగా విస్మరించారని తెలిపారు. ప్రస్తుతం వ్యాపారం బాధ్యత కూడా తానే చూసుకుంటున్నానని స్పష్టం చేశారు. తమ క్వారీ పైన 48 కోట్లు పెనాల్టీ వేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మీ మధ్య చెవిరెడ్డి, పెద్ది రెడ్డి మధ్య ఉన్న కక్షలు మా పై రుద్దడం సమంజసం కాదని హితవు పలికారు. తమ ఆర్థిక మూలాలను దెబ్బతీయడానికి చెవిరెడ్డి విఫ్వప్రయత్నం చేశారని గుర్తు చేశారు. తమ క్వారీలకు సంబంధించి ప్రతి నెల కరెంటు బిల్లులు మూడు నుంచి ఐదు లక్షల వరకు కడుతున్నామన్నారు. మీకు ఏమైనా అనుమానం ఉంటే ఆన్‌లైన్‌లో తమ కరెంట్ బిల్లులు నెంబర్లు కొట్టి చూసుకోవచ్చు అన్నారు. తన భర్తపై హత్యాయత్నానికి ప్రయత్నించింది కాక మళ్ళీ నానిని అవహేళన చేస్తారా అని నిలదీశారు. ఎలక్షన్ కమిషన్ ఆధీనంలో ఉన్న సిసి పుటేజీలు చెవిరెడ్డికి ఎలా వచ్చాయని ప్రశ్నించారు. అందుకు మొదటి విట్నెస్ తానే అయినా తనకు అధికారులు ఇంతవరకు ఎందుకు విచారించలేదన్నారు. సస్పెండ్ అయిన పోలీస్ అధికారులు ఎవరు మా వల్ల సస్పెండ్ అవ్వలేదని మీరు ఓడిపోతారని ముందే తెలిసే నాని పై హత్యాయత్నానికి ప్రయత్నించారన్నారు. సంఘటన జరిగిన రోజున మోహిత్ రెడ్డి ఉన్న సిసి కెమెరాల పుటేజిని ప్రదర్శించారు.

# చిత్తూరు సంస్కృతిని చంద్రగిరికి తెచ్చిన ఘనత నానిదే

## ఏనాడు టిడిపి నాయకులపై వేధింపులకు పాల్పడలేదు : చెవిరెడ్డి భాస్కరరెడ్డి



తిరుపతిరూరల్, జూలై 20 ప్రభాతవార్త:

చిత్తూరు రౌడీ సంస్కృతిని చంద్రగిరికి తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే పులివర్తి నానికే దక్కుతుందని... వైకాపా కార్యకర్తలపై ముసుగువేసి భౌతికదాడులు చేయించడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. తాను పదేళ్ళ ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో ఏ ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్తలపై వేధింపుకు పాల్పడలేదన్నారు. పులివర్తి నానిని ఏనాడు ఏకవచనంతో సంబోధించలేదని, నాని అన్న అనే సంబోధించాను...కానీ నాని ఏకవచనంతో రేయ్ అని సంబోదించడం, వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. శనివారం ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పులివర్తి నాని చదవులేకనే అర్థరహితంగా వాక్యలు చేస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2024 వరకు మీ క్వారీలు ఏనాడైనా మీ క్వారీలుపై దాడులు జరిగాయా! 12 లారీలు రవాణా చేస్తుంటే ఏ రోజైనా ఆపారా అని ప్రశ్నించారు. గత పదేళ్ళగా మీ పార్టీ కోసం కార్యకర్తల రక్షణ కోసం జైలుకు వెళ్లావా, గత ఐదేళ్ళలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఒక్కరోజైనా ప్రెస్‌మీట్ పెట్టి పోరాటం చేసావా! ఒకసారి నాని క్వారీలకు సాధారణ తనిఖీలకు జిల్లా మైనింగ్ అధికారులు వెళ్తుంటే...మీ బంధువు ప్రసాద్ ద్వారా టెలికాన్ఫరేన్స్‌లో నాతో మాట్లాడలేదా...మా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రెండుసార్లు కలిసానని చెబుతున్న నాని, ఎందుకు కలిసినట్టు అని ప్రశ్నించారు. పులివర్తి నాని కిలారు రాజేష్ పేరు చెప్పి దందాలు చేయలేదా! అధికారులను బెదిరించలేదా! కిరోసిన్, పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటా అని ఎమోషనల్ బ్లాక్ మెయిల్ బెదిరించలేదా...చంద్రగిరి ప్రజలకు ఎన్నికల్లో నేను ఓడిపోతే నేను 4వ తేదీన ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించలేదా అని పేర్కొన్నారు.. ఓటరు లిస్టులో దొంగ ఓట్లు నమోదు చేసారో నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం సి.ఐ.డికు జరపాలని తానే లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

## విద్యార్థులు అతివేగంతో వాహనాలు నడిపొద్దు



– జూనియర్ సివిల్ జడ్జి ఆరిఫా షేక్

కుప్పంరూరల్, జూలై 20 ప్రభాతవార్త

విద్యార్థులు అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆరిఫా షేక్ సూచించారు. శనివారం కుప్పం ఐఆర్ఎం డిగ్రీ కాలేజీలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్ల ని ండని వారు వాహనాల డ్రైవింగ్ చేయరాదని సూచించారు. అలాగే రోడ్డు భ ద్రత నియమాలు పాటించాలన్నారు. అర్బన్ సిఐ జిటి నాయుడు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి, అకడమిక్ డైరెక్టర్ మధుసూధన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డిఎస్పీ



కుప్పంరూరల్, జూలై 20 ప్రభాతవార్త

సమాజంలో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిఎస్పీ శ్రీనాథ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక నారాయణ పాఠశాలలో ఎజిఎం రవీంద్ర ఫణికుమార్ అధ్వర్యంలో మొక్కలు నాటే చేపట్టారు. డిఎస్పీ మాట్లాడుతూమొక్కలునాటివాటినివిధిగా సంర క్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఆర్ఐ ప్రసాద్, కోఆర్డి నేటర్‌శ్రీకాంత్,ఎజిఎం బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఎఓ నరేష్, ఎడి ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నారా భువనేశ్వరి పర్యటన జయప్రదం చేయాలి

కుప్పం, జూలై 20 ప్రభాతవార్త



ఈనెల 23-26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, సలహాదారు నరేష్ చారి, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మండల, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 24న కుప్పం మండలం కొత్తపల్లి, నడిమూరు, పైపాళ్యం, ఉర్ల ఓబనపల్లి, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో నారా భువనమ్మ పర్యటిస్తారన్నారు. మహిళలతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని మహిళలు అధికంగా హాజరయ్యేలా నేతలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నేతలు ఎవి రవి, మహేంద్ర, రామచంద్ర, వసంతమ్మ, సంతోష్, రవి, కృష్ణయ్య, రాజగోపాల్, పార్థసారథి, వల్లెప్ప, బగ్గిడి వెంకటేష్, శివకుమార్, బాలాజీ, సంజీవి, అశోక్, సుబ్బ్ర, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొంగనపల్లిలో జనసేన సభ్యత్వ నమోదు

రామకుప్పం, జూలై 20 ప్రభాతవార్త



మండలంలోని కొంగనపల్లి పంచాయతీలో శనివారం జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ సమన్వయకర్త డా॥ నరేష్ అధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందే కార్యకర్తలకు ఐదు లక్షల భీమా సౌకర్యంను అధిష్టానం కల్పిస్తోందన్నారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున యువత, గ్రామస్తులు డి.సిఎం పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి సభ్యత్వాలు పొందారు. కార్యక్రమంలో నేతలు హరీష్, పవన్ మహేష్, పవన్, శ్రీకాంత్, భాస్కర్, గంగాధర్, సురేష్, చరణ్, మహేష్, నందకుమార్, అంజి, శ్రీకాంత్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## ఏడు చోట్ల తక్కువ ధరకే కందిపప్పు..బియ్యం విక్రయాలు - తహశీల్దార్ హరికుమార్

కుప్పంరూరల్, జూలై 20 ప్రభాతవార్త

ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో కుప్పం పట్టణంలోని ఏడు దుకాణాల్లో తక్కువ ధరలకే ప్రజలకు కందిపప్పు, బియ్యం విక్రయాలు చేసేలా చర్యలు చేపట్టినట్లు తహశీల్దార్ హరికుమార్ తెలిపారు. కుప్పంలో రైతు బజార్ లేని కారణంగా రిటైల్ దుకాణాల్లో ప్రజలకు తక్కువ ధరలకే ప్రభుత్వం తరపున సరుకుల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.కుప్పం పట్టణంలోని పిఆర్ ప్రసాద్‌కుమార్, కన్యకాపరమేశ్వరి ట్రేడర్స్, నిత్యానందం, సాయిరాం ట్రేడర్స్, సత్యనారాయణ ట్రేడర్స్, శ్రీ అన్నయ్య శెట్టి ట్రేడర్స్, శరవణ బిగ్ బజార్‌లలో బిపిటి రకం సోనా మసూరి బియ్యం కిలో 49రూ., దేశవాళి కందిపప్పు కిలో 160రూ.ల వంతున లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన



-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, .జూలై 20

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన దాత ఎంఆర్‌సీ మోహన్ నాయుడు దంపతులు తన స్వంత నిధులతో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించిన 3.50 లక్షలు విలువగల 35 వేల నోట్ పుస్తకాలను శనివారం అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని తెలిపారు. అలాగే విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, దాతల సహకారంను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అలాగే ఇకపై తనను వారు బొకేలు, శాలువాలు తీసుకురావద్దని, పెన్నులు, పెన్సిళ్ళు, పుస్తకాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పేద విద్యార్థికి విద్య అందేవిధంగా విద్యావ్యవస్థలో నారా లోకేష్ సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో దాత మోహన్‌నాయుడు దంపతులు, మండల టీడీపీ అధ్యక్షుడు దిలీప్, ప్రధాన కార్యదర్శి మదుకుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్ చౌదరి,మాజీ వైస్ ఎంపీపీ భాస్కర్‌నాయుడు, ఎంఈఓ హేమలత, నాయకులు రంజిత్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్,పరందామనాయుడు, రఘుపతి, ప్రవీణ్‌లతో పాటు ఉపాధ్యా యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్దగిరి ఆలయ ఛైర్మన్ పదవికై ఎమ్మెల్యేకు వినతి

తవణంపల్లె, జూలై 20 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్దగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ పదవిని పైమాఘంకు చెందిన బలిజ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ఎ.రఘుపతికి కేటాయించాలని కోరుతూ అరగొండకు చెందిన బలిజ కులస్థులు స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం అరగొండ పైమాఘంలో ఎమ్మెల్యే మురళీమోహన్‌ను బలిజ కులస్థులు ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా అర్దగిరి ఆలయ ఛైర్మన్ పదవిని అరగొండ పైమాఘంకు చెందిన ఎ.రఘుపతికి ఇవ్వాలని స్థానిక బలిజ సామాజిక వర్గం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.ఈమేరకు రఘుపతికి ఛైర్మన్ పదవిని కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో అరగొండ బలిజ సామాజిక వర్గానికి నాయకులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, మదుకుమార్, మాజీ జడ్పీటీసీ వెంకటేస్ చౌదరి,మోహన్ నాయుడు, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచలంకు ఆరు ఆర్టీసి సర్వీసులు

పుంగనూరు,జూలై 20 ప్రభాతవార్త:

గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం క్షేత్రానికి పుంగనూరు డిపో నుంచి ఆరు ప్రత్యేక సర్వీసులు శనివారం ఏర్పాటుచేశారు. డిపో మేనేజర్ సుధాకరయ్య అధ్వర్యంలో పుంగనూరు నుంచి ఆరు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు శనివారం మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా డిపోలో బస్సులకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సులను ప్రారంభించారు. ఈసర్వీసులు పుంగనూరు ప్రాంతం నుంచి ఆలయానికి వెళ్ళే భక్తులతో ముందస్తుగా రిజర్వేషన్‌తో పాటూ అప్పటికపుడు సీట్లు భర్తీచేసుకుని బయలుదేరాయి. ఈసందర్భంగా డిపోమేనేజర్ సుధాకరయ్య మాట్లాడుతూ తిరువణ్ణామలై క్షేత్రానికి ప్రతినెలా సర్వీసులు నిర్వహిస్తున్నామని, అధికమంది భక్తులు ప్రయాణించే సమక్షంలో ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేసి వారి ప్రాంతం నుంచే పంపించేలా వీలు కల్పిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసి మజ్దూర్‌యూనియన్,ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలి

పెద్దపంజాణి జూలై 20 ప్రభాతవార్త :

మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలపై అధికారయంత్రాంగం చొరవచూపాలని ఎంపిపి రెడ్డెప్ప పేర్కొన్నారు.శనివారం మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా గ్రామాలో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేరేందుకు ప్రజాప్రతినిధులు పదవతరగతి పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహనకల్పించి జూనియర్ కాలేజీలో చేర్పించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.అదేవిధంగా మధ్యాహ్న భోజనపథకంలో భాగంగా వంటలు,వంటశాలలో శుభ్రత పాటించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. పభుత్వ కార్యాలయాలకు బ్యానర్లు అంటించి కార్యాలయాలు కనబడకుండా తెదేపానేతలు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని వైస్ ఎంపిపి జి.డి.బాబు ఎంపిడిఓ అబ్దుల్ రహీంను కోరారు.ఎంపిడిఓ మాట్లాడుతూ పెన్షన్లు పొందుతున్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.కొళత్తూరు పంచాయతీలో మాత్రం జిల్లా అధికారుల ఆదేశాలమేరకు ఇద్దరు డప్పు కళాకారులకు పెన్షన్లు పంపిణీచేయలేదని అన్నారు.ఈ సందర్భంగా వీరప్పల్లి తెదేపా ఎంపిటిసి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో కొంతమంది వాలంటీర్లు,నాయకుల ప్రోద్భలంతో కొన్నిపంచాయతీల్లో తప్పులతడకగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జరిగాయని ఆ మ్యాపింగ్ ఆధారంగానే నిర్వహిస్తున్నారని అధికారులను తప్పు పట్టవద్దని వైస్ ఎంపిపికి సూచించారు. డిప్యూటి తహశీల్దార్ ఫణికుమార్, అధికారులు,సర్పంచులు,ఎంపిటీసీలు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పాత పద్ధతిలోనే తిరుణాళ్ళ నిర్వహణ : శ్రీనివాసరావు



చౌడేపల్లి, జూలై 20 ప్రభాతవార్త

సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ తిరుణాళ్ళను పాత పద్ధతిలోనే నిర్వహిస్తున్నట్లు టిటిడి సూపరిండెంటెంట్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం రాజనాబండ తిరుణాళ్ళను గురించి ఆలయ అధికారులు, అర్చకులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. రాజనాలబండ టిటిడి ఆధీనంలో వున్నప్పటికీ ఇప్పటి వరకు స్టేటస్‌కోలేనే వుందన్నారు. శ్రావణమాసంలో యేటా జరిగేలా తిరుణాళ్ళను ఈ దఫా కొన సాగిస్తారన్నారు. ఈమేరకు తిరుణాళ్ళు జరిగే తీరును, ఖర్చును అడిగి తెలుసుకొన్నారు. రాజనాలబండ సాంప్రదాయం ఏ విధంగా వుందో అదే తరహాలో ప్రతిష్టాత్మకంగా జరిగేలా చర్యలు తీసుకొంటామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రకాష్, ప్రధానార్చకుడు కృష్ణమూర్తి, టిటిడి సిబ్బంది, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

## కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యం భూములను రక్షించండి : బిజెపి

-కమీషనర్‌ను కోరిన నాయకులు

చౌడేపల్లి, జూలై 20 ప్రభాతవార్త



చౌడేపల్లిలోని కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యం భూములను రక్షించాలని పలువురు బిజెపి నాయకులు, దేవస్థాన నిర్మాణదాతలు రాష్ట్ర దేవాదాయధర్మాదాయశాఖ కమీషనర్ సత్యనారాయణను కోరారు. శనివారం తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి వెళ్ళి మాన్యం భూముల స్థితిగతులు తెలిపినట్లు బిజెపి కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ తెలిపాడు. చౌడేపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో కోట్లాది విలువ చేయు మాన్యం భూములున్నాయనీ, వాటిని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చి చౌడేపల్లి, చిన్నకొండామర్రి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలకు చెందిన మాన్యం భూములను కబ్జాకోరల నుంచి విడిపించి ఆలయాల్లో నిత్యకైంకర్యాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్ కోరినట్లు ఆయన వివరించారు. చిన్నకొండామర్రి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణదాత మనోహర్, బిజెపి నాయకుడు గండోడి ప్రవీణ్‌కుమార్‌లు కమీషనర్‌ను కలసిన వారిలో వున్నారు.

## దయచేసి బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టండి

పదేళ్ల నిరీక్షణకు ఇకనైనా తెరపడుతుందా



పాకాల, జులై 20, ప్రభాతవార్త

పాకాల నుండి మద్ది నాయన పల్లికి వెళ్లే దారిలో సూరినేనిపల్లి, బుల్లయ్యగారిపల్లి మధ్యలో వంక పైన ఉన్న బ్రిడ్జి గుంతలమయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది క్రితం ఈ మార్గంలో తారు రోడ్డు వేసినప్పటికీ బ్రిడ్జి పై ఎలాంటి నిర్మాణం చేపట్టకపోవడంతో రోడ్డు గుంతల మయం కావడంతో వాహనదారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించవల్సిందిగా వెంకటాద్రి నాయుడు చేయాలని కోరుతున్నారు.

## తెలుగుతల్లి,వాల్మీకి,పూలే విగ్రహాల పున:ప్రతిష్ట



-దేశం నాయకుడు సుకుమార్‌బాబు

పుంగనూరు,జూలై 20 ప్రభాతవార్త:

పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా ముడెప్ప వలయం వద్ద ఉన్న తెలుగుతల్లి,వాల్మీకి,పూలే విగ్రహాలను కాంట్రాక్టర్లు తొలగించి మూలనపడేయడంతో ఇంత వరకు వాటిని పట్టించుకునే దిక్కు లేకపోయింది. దీనిపై విశ్రాంత డిఎస్పీ,రాష్ట్రవాల్మీకి సంఘ ఛైర్మన్,తెలుగుదేశం నాయకుడు కె.సుకుమార్‌బాబు తక్షణం స్పందించారు. తెలుగుతల్లి విగ్రహంతో పాటూ రామాయణ కావ్యం రచించిన శ్రీవాల్మీకిమహర్షి,పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసి పూలే విగ్రహాలను తగు జాగ్రత్తలతో పున:ప్రతిష్టించేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు శనివారం ఉదయం ఇదే ముడెప్ప వలయం వద్ద ఉన్న స్థలంలో దిమ్మెను ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ మూడు విగ్రహాలను పున:ప్రతిష్టించి ప్రతి వారం పూలమాలలు వేసి పూజలు చేసే మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లాబాబుల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అభివృద్ధి పనులపై దృష్టి సారించండి



గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

గూడూరుజూలై 20 ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పురపాలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వలన గూడూరు మున్సిపాలిటీ అధోగతి పాలైందన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించి, పరిష్కరించాలన్నారు. గూడూరు అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, నాయకులు నిమ్మకాయల నరసింహులు, తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, దువ్వూరు రవీంద్ర రెడ్డి, వాటంబేడు శివకుమార్, గురవయ్య, పరమేశ్వర గౌడ్, మహిళలు మట్టం శ్రావణి, భారతమ్మ, శ్రీదేవి, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కెవికె ద్వారా రైతులకు విరివిగా సేవలందించాలి

టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీసాయి ప్రియ

వెంకటగిరి జులై 20, ప్రభాతవార్త



కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు విరివిగా సేవలందించాలని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కురుగొండ్ల లక్ష్మీసాయి ప్రియ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. కెవికెను మా నాన్న రామకృష్ణ రైతుల కోసం ఇక్కడ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. రైతులకు పద్ధతులు నేర్పించాలని సూచించారు. రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వాలని తెలిపారు. రైతులు మార్కెట్‌లో గిరాకి ఉండే పంటలనఉ సాగు చేయాలని సూచించారు. డాక్టర్ బిజి రాజులను అడిగి పలు తెలుసుకున్నారు. ముందుగా అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని వారికి క్రమం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. చిన్నారులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించమని తెలిపారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు విదార్యర్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత వస్తున్నట్లు చెప్పారు. మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టాలమ్మ ఆలయంలో అన్నదానం



కోట, జూలై 20 ప్రభాతవార్త

కోట మండలం చెందోడు గ్రామదేవత శ్రీపుట్టాలమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి కలశంతో పాటు వివిధ పుష్పాలంకరణలతో అమ్మవారిని గ్రామపురవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్నారు.

## కోరం లేక మండల సమావేశం వాయిదా

కోట, జూలై 20 ప్రభాతవార్త

కోట మండల పరిషత్ కార్యాలయం శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో ఎంపిడిఓ శంకరయ్య సభను వాయిదా వేశారు. తగినంతమంది ప్రజాప్రతినిధులు హాజరుకానందున సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఓ ప్రకటించారు.

## మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

చౌడేపల్లి, జూలై 20 ప్రభాతవార్త

మండంలోని ఐకెపి మహిళలకు డిడిసి బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక ఐకెపి భవనంలో బంగారు రుణాలు, తక్కువ వడ్డీలు, వ్యవసాయ రుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష భీమాయోజనా, అటల్ పెన్షన్ యోజనా పథకాలు, డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్, మోసాలను గురించి మహిళలకు అర్థమయ్యే రీతిలో ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత మేజిక్ షో ద్వారా, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఐకెపి ఎపిఎం సర్వోత్తమరెడ్డి, మేనేజర్లు వెంకటేష్‌బాబు, గీర్వాణీ, డప్పు చిరంజీవి, వెంకటేష్, ఐకెపి మహిళలు పాల్గొన్నారు.

## బాబాయ్ హత్యపై జగన్ ఢిల్లీలో ధర్నా చేయాలి

కోట, జులై 20 ప్రభాతవార్త

ఐదేళ్లుగా తేలని జగన్ బాబాయ్ వివేకానందరెడ్డి హత్యపై ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధర్నా చేయాలని తిరుపతి తెలుగుదేశం పార్టీ బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో 22 మంది ఎంపిలు ఉన్నా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కసారి అయినా ఢిల్లీలో ధర్నా చేయలేదన్నారు. ప్రత్యేక హోదా, ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని ఎంపిలను తీసుకెళ్లి మాట్లాడలేదని, అలాంటిది ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. బాబాయ్ హత్య కేసు విచారణ జరిపి నిందితుడిని పట్టుకోవాలని కేంద్రాన్ని అడగని జగన్‌కు ఇప్పుడు ఢిల్లీ వెళ్లి ధర్నా చేసే హక్కు లేదన్నారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యకు రాజకీయ రంగు పులమడం జగన్‌కే చెల్లుతుందన్నారు.

## ఉపాధి పనులు పెంచి ఎక్కువ వేతనం అందుకోండి

– ఎంపిడిఓ విజయకుమార్



తడ, జూలై 20 ప్రభాతవార్త

తడ మండలంలోని ఉపాధి హామీ పథకం పనులు మరింత పెంచి కూలీలకు ఎక్కువ వేతనం అందేలా చూడాలని ఎంపిడిఓ ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్యను కూడా పెంచాలని, కనీస వేతనం రూ.300 వచ్చేలాగా ప్రయత్నించాలని సూచించారు. బిల్లుల విషయంలో ఆలస్యం వహించకూడదన్నారు. క్షేత్రస్థాయిలో మండల అధికారులు వచ్చి పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఎంపిడిఓ చెప్పారు.

### గూగుల్ మీట్‌లో అధికారులు

తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో శనివారం గూగుల్ మీట్ నిర్వహించారు. తడ ఎంపిడిఓ విజయకుమార్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు ఇందులో పాల్గొన్నారు. ఇటీవల వర్షాల కారణంగా వస్తున్న వ్యాధులను అరికట్టాలని, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు.

## బేటీ భచావో.. బేటీ పడావో కార్యక్రమం

చిల్లకూరు, జులై 20, ప్రభాతవార్త



చిల్లకూరులోని అల్లీపురం ఎస్సీ అంగన్‌వాడి కేంద్రంలో బేటీ భచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఎస్‌కె మహబాబి మాట్లాడుతూ ఆడపిల్లలను బ్రతకనిద్దాం.. చదవనిద్దాం అని పిల్లలకి బాల్య వివాహాలు చేస్తున్నాన్నారు. అలాగే వాళ్లని చదివించకుండా బడి మానించి ఇంటికి పరిమితం చేయటం జరుగుతుందని అన్నారు. నేటి సమాజంలో స్త్రీ బాల్య వివాహాలు వల్ల నష్టపోతున్నది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇందుకు కారణం తల్లిదండ్రులు వీరికి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి. శివజ్యోతి, అంగన్‌వాడి కార్యకర్త జయమ్మ, తల్లులు, పిల్లలు కిసోర బాలికలు పాల్గొన్నారు.

## ప్రజలకు నరకం చూపించిన వైసిపి ప్రభుత్వం

ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జులై 20, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రజలకు వైసిపి ప్రభుత్వం నరకం చూపించిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. గుంటలు మెట్టలుగా ఉన్న గూడూరు వెంకటగిరి రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు వెంకటగిరి రోడ్‌లో ప్రయాణం అంటేనే ప్రజలు భయపడేవారని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చేసి ఇబ్బందులు పడ్డట్టు తెలిపారు. రోడ్డు సమస్యను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. త్వరలో రోడ్డు నిర్మాణ పనులను చేపడతామని వివరించారు.

## దుర్గంధపూరితంగా మారిన మరుగు కాలువ

రగులుతున్న వ్యాధులు

వెంకటగిరి, జులై 20, ప్రభాతవార్త

పట్టణంలోని 14వ వార్డులో మురికి కాలువ దుర్గంధపూరితంగా ఉండడంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారు. కలుజు కాలువ వల్ల మురుగునీటిని కూడా స్థానికులలోకి వదులుతున్నారు. కాలువలో చెత్తాచెదారం పేర్కొని ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు.

## సెప్టెంబర్ 28, 29 తేదీల్లో టైప్‌రైటింగ్ పరీక్షలు

సూళ్లూరుపేట, జూలై 20 ప్రభాతవార్త

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో టైప్‌రైటింగ్ పరీక్షలు సెప్టెంబర్ 28, 29 తేదీలలో నిర్వహిస్తారని నెల్లూరు జిల్లా టైప్‌రైటింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జివిపి ప్రభాకర్, జోనల్ కార్యదర్శి ఎ.రమేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 28, 29 తేదీలలో నెల్లూరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. తెలుగు, ఇంగ్లీష్ లోయర్, హయ్యర్ గ్రేడ్లలో, ఇంగ్లీష్ హైస్పీడ్, ఇంగ్లీ జూనియర్ గ్రేడ్‌లలో ఈ పరీక్షలు ఉంటాయన్నారు. షార్ట్ హ్యాండ్ పరీక్షలు సెప్టెంబర్ 21, 22 తేదీలలో జరుగుతాయని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు జూలై 31వ తేదీలోగా స్థానికంగా ఉన్న టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని వారు కోరారు.

## రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

దొరవారిసత్రం జూలై 20 ప్రభాతవార్త;

మండలంలోని తల్లంపాడు సమీపంలో జాతీయరహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో శనివారం ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు.సేకరించిన సమాచారం మెరకు వివరాలిలా ఉన్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన రామచంద్రయ్య,సుబ్బయ్యలు మోటార్‌సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్ళి తిరిగి సూళ్ళూరుపేటకు వస్తుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం తల్లంపాడు వద్దకు వచ్చేసరికి వెనుకనుండి అదేమార్గంలో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్‌ను ఢీకొంది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న రామచంద్రయ్య,సుబ్బయ్యలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్సనిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు

## తెలుగు రాష్ట్రాల్లో విశేషంగా కమ్మవారి సేవలు

– రాష్ట్ర తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు

పాలసముద్రం, జులై 20 ప్రభాతవార్త:



రెండు తెలుగు రాష్ట్రాల్లో కమ్మవారు విశేష సేవలు అందించి అందరి అభిమానం చురగొంటు న్నారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు అన్నారు. హైదరబాదులో శనివారం ప్రారంభ మైన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కర్నాటక రాష్ట్రంలోని కమ్మ వారితో పాటు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు హాజరయ్యారు. కమ్మవారికి ఎక్కడ ఎలాంటి నష్టం వచ్చినా కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ద్వారా ఆదుకొంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన ప్రముఖ కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు

## కుష్ఠు వ్యాధిపై అవగాహన

పాలసముద్రం, జులై 20 ప్రభాతవార్త:

కుష్టు వ్యాధి కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సిహెచ్ఓ జ్ఞానశేఖర్ ఆధ్వర్యంలో పిహెచ్‌సి సిబ్బంది శనివారం మండలంలోని కొల్లురెడ్డి కండ్రిగ ఎస్‌బిఆర్‌పురం, వెంగళరాజుకుప్పం గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు లెప్రసీ ఎలా వస్తుంది! వ్యాధి లక్షణాలు ఎలా వుంటాయి! వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు వివరించారు. ఈ వ్యాధికి అన్ని ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్‌వైజర్ మురళీకృష్ణ, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, స్థానిక సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## తహసిల్దారుకు ఘనంగా వీడ్కోలు



గుడిపాల, జులై 20 ప్రభాతవార్త:

ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు గుడిపాల తహసిల్దారుగా నియమితులైన విజయ లక్ష్మీని ప్రభుత్వం సొంత జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం తహసిల్దారును తహసిల్దారు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దారు కళ్యాణి, ఆర్ఐ రమసాయిలు తహసిల్దారు విజయలక్ష్మీకి శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు రాజారావు, వెంకటాచలం, రమేష్, శోభన్‌బాబు, సురేష్, గోపి, భవదీప్, యదునాథ్, విఆర్ఎలు తదితరులు పాల్గొన్నారు.

# రెస్కోలో విద్యుత్ బకాయిదారులకు నోటీసులు

**- మొండిబకాయిల వసూళ్లపై జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి !**




కుప్పం, జూలై 30 ప్రభాతవార్త : కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లపై జాయింట్ కలెక్టర్, రెస్కో పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు ప్రత్యేక దృష్టి సారించారు. సంస్థ పరిధిలో అత్యధికంగా విద్యుత్ బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. దీంతో గత ఐదారు రోజులుగా రెస్కో అధికారులు, సిబ్బంది భారీస్థాయిలో బకాయిలు ఉన్న వినియోగదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. రూ 5వేలకు పైబడి బకాయిలు ఉన్న వారికి నోటీసులు అందిస్తున్నారు. కాగా కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)కు దాదాపు 150 కోట్ల మేర బకాయిలు వసూలు కావాల్సి ఉంది. అందులో ప్రభుత్వ శాఖలనుంచే దాదాపు 100 కోట్ల దాకా బకాయిలు అందాల్సి ఉన్నట్లు తెలిసింది. ఈ బకాయిలు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, వీధి దీపాలు, నీటి ట్యాంకులు, నీటి సరఫరా తదితరాలకు సంబంధించి వసూలు కావాల్సి ఉందని సమాచారం. అలాగే వినియోగదారులు, పరిశ్రమలనుంచి సుమారు 50 కోట్ల దాకా బకాయిలు పేరుకుపోయాయి. దీంతో సంస్థ ఆర్థికంగా మరింత దిగజారకుండా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి మొండి బకాయిల వసూళ్లకు ఆదేశించారు. ఇదిలా ఉండగా రెస్కోకు లక్షల్లో బకాయిలు ఉన్న వారు వన్ టైం సెటిల్మెంట్ విధానం అమలు చేయాలని కోరుతున్నారు. ఈ వన్‌టైం సెటిల్మెంట్ విధానం అమలు చేస్తే వినియోగదారులకు రాయితీ లభించే అవకాశం ఉంది.వెయ్యి రూపాయలు అంతకు పైబడి ఉన్న బకాయిలకు ఒక్కో దశలో ఒక్కో రాయితీ కల్పిస్తే పేరుకుపోయిన మొండి బకాయిలు వసూలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

# మా పంట భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

**- చల్లాబాబుకు బాధితుల మొర**



పుంగనూరు,జూలై 20 ప్రభాతవార్త : తమ పంటభూములకు వెళ్ళేందుకు దారులు అడ్డగిస్తున్న వారిపై చర్యలుతీసుకోవాలని తమ వ్యవసాయ పొలాలకు వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు కల్పిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ఈడిగపల్లికు చెందిన షికారిపాలెంకు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా బాబుకు విజ్ఞప్తి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎంసిపల్లి పంచాయతీ పరిధిలోని షికారిపాలెంలో వంద వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి ప్రభుత్వాలు నివాస గృహాలతో పాటూ ప్రతి కుటుంబానికీ అక్కడ కొండగుట్టల వద్ద వ్యవసాయపొలాలను కూడా అందచేసింది. కూలీనాలీ చేసుకుంటూ వీలు చిక్కినపుడు వ్యవసాయం చేసుకుంటూ వీరు జీవిస్తున్నారు. ఈక్రమంలో తమ పొలాలను ఆనుకునే ఉన్న భూస్వాములు ఇటీవల కాలం నుంచి తాము తమ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు వీలు లేకుండా ఆక్రమణ చేశారని ఆరోపించారు. భూస్వాముల ఆక్రమణల వల్ల తమ పొలాలకు వెళ్ళడానికి వంకలోనే నడచివెళ్ళాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. నలభై ఏళ్లుగా తమ వ్యవసాయ పొలాలకు ఉన్న దారిని ఆక్రమించడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ఇటీవల పండించిన టమోటా పంట దిగుబడికి వచ్చిందని,అయితే,నీటిలో నడచి క్రేట్‌లను తీసుకురావాల్సి ఉండడంతో కూలీలు రావడంలేదన్నారు. తామే పొలాల నుంచి పంటలను మోకాలు లోతు నీళ్లలో నడుచుకుంటూ వెళ్ళి తీసుకురావాల్సి వస్తోందన్నారు. తమకు న్యాయబద్ధంగా ఉన్న పొలాల వరకు దారి సమస్యను పరిష్కరించాలని వారు వేడుకొంటున్నారు.

## అంతరిక్ష ప్రయోగ కేంద్రంలో ఇస్రో చైర్మన్ పర్యటన



శ్రీహరికోట (తడ), జూలై 20 ప్రభాతవార్త : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లో ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పర్యటిస్తున్నారు. ఆయన ఇక్కడ జరగనున్న ఎక్స్ పెరి మెంటల్ రాకెట్ ప్రయోగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 22న ఎటివి-డి03/డిఎఫ్ఎస్ ప్రయోగం షార్ నుంచి జరపనున్నారు. వాతావరణ అధ్యయనాల కోసం ఈ ఎటివి ప్రయోగం ఇస్రో చేపట్టింది. ఇందులో ఎటువంటి ఉపగ్రహాలు లేకుండా భూమికి తక్కువ దూరం నుంచి పరిశోధనలు చేస్తుంది. ఇదిలావుంటే శ్రీహరికోటలో నూతనంగా నిర్మితమైన ఘన ఇంధన కర్మాగారం పనులను కూడా ఇస్రో చైర్మన్ సోమనాథ్ పరిశీలించనున్నట్లు తెలిసింది. ఆయన శాస్త్రవేత్తలతో ఎక్కువ సేపు గడిపి కొన్ని సూచనలు ఇవ్వనున్నారు. భవిష్యత్‌లో జరిగే గగన్‌యాన్ ప్రాజెక్టును కూడా షార్‌లో ఏర్పాట్లపై చర్చించనున్నారు. చెన్నై ట్రిపుల్ ఐటీలో గౌరవ డాక్టరేట్ అందుకున్న సోమనాథ్ అక్కడి నుంచి షార్‌కు వచ్చి అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనలు పర్యవేక్షిస్తున్నారు.

## ప్రత్యేక విక్రయ కేంద్రం ప్రారంభం



చిల్లకూరు, జులై 20 ప్రభాతవార్త : బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులు ఎక్కువ ధరలు ఉండడం వలన రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు కార్యక్రమాలు చేపడుతుందని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు చిల్లకూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. చిల్లకూరు మండల కేంద్రంలో సచివాలయ సమీపంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను సామాన్య ప్రజలకు తక్కువ ధరలకు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని శనివారం తహశీల్దార్ శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, దాసరి రాము చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజా, సురేష్, మధు, సుబ్బయ్య, మురళి, జగదీష్, చిన్న, వీఆర్ఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్ధాల నిర్మూలనకు పోలీసుల తనిఖీలు



నాయుడుపేట, జూలై 20 ప్రభాతవార్త:ఇటీవల కాలంలో నాయుడుపేట ప్రాంతం గంజాయి, ఇతర మత్తుపదార్ధాలకు కేంద్రంగా మారిందన్న ప్రచారం నేపథ్యంలో పోలీసులు, సెబ్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తూ హడలెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాయుడుపేట పట్టణంలోని గోమతి సెంటర్‌లో సిఐ శ్రీనివాసులురెడ్డి, సెబ్ సిఐ అరుణకుమారి, సెబ్ ఎస్ఐ ఎడి మున్వీర్ అహ్మద్, ఇరుశాఖల సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం పలు వాహనాలను తనిఖీలు చేశారు. తిరుపతి-నాయుడుపేట రహదారిపై పలు వాహానాలను ఆపి సోదాలు చేశారు. ఎక్కడైనా గంజాయి, హాన్స్, గుట్కా, ఇతర మత్తుపదార్ధాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. మత్తుపదార్థాలు అమ్మినా, కొన్నా నేరమని వారు అన్నారు. వీటిపై సమాచారం తెలిస్తే ప్రజలు తమకు తెలియజేయాలని కోరారు.

## రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలి



సూళ్లూరుపేట, జూలై 20 ప్రభాతవార్త : రాష్ట్రంలో మహిళలకు ప్రస్తుతం రక్షణ కరువయ్యిందని, మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని సూళ్లూరుపేట ఎబివిపి డిమాండ్ చేసింది. శనివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.యాచేంద్ర మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 30 రోజుల్లో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయన్నారు. హోంమంత్రి సాక్షాత్తు మహిళ అయినప్పటికీ సాటి మహిళలకు రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఎబివిపి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు రాఘవేంద్ర, సన్ని, వైష్ణవి, వెంకటేష్, రాకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



బాలాయపల్లి, జులై 20 ప్రభాతవార్త: రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెలుగు కార్యాలయంలో జరిగిన బాలాయపల్లి మండల పరిషత్ సమావేశంకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు గంగా నీరు చెరువులకు ఇవ్వాలని కొందరు కోరాలని అన్ని చెరువులకు ఇప్పిస్తామని తెలిపారు. పంటలు పండకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు ఇస్తామని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి గూడూరు రోడ్డు నిర్మించాలని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లాలని తెలిపారు. త్వరలో ఈ రోడ్డు పనులు ప్రారంభమై పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న రోడ్లను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గ్రామాల్లోని పలు సమస్యలను సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ అరుణ, తహశీల్దార్ పుల్లారావు, హౌసింగ్ జహీర్ అహ్మద్, ఏఏలు చంద్రశేఖర్, లక్ష్మి సాయి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మకు శివయ్య సన్నిధి నుంచి సారె



శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త: విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న శాకాంబరి ఉత్సవాలకు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను అందించారు. రెండేళ్ళుగా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు ఇతర ఆలయాల నుంచి సంప్రదాయ బద్ధంగా ఆలయాల మధ్య సమన్వయం కోసం సారె అందించే మంచి సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా వెంకటసుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత మొదటి సారె అందించే కార్యక్రమంలో పాల్గొన్నారు.వారికి ఆలయ ఇఓ కెయస్ రామారావు వేదపండితులతో స్వాగతం పలికారు.సారెను ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,నాగభూషణం యాదవ్, వేదపండితుడు శివప్రసాద్,హేమంత్ శర్మ, సంతోష్‌శర్మ,ఎస్ఎంకె శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. అమ్మవారికి సారె బహూకరించిన వెంకటసుధీర్‌రెడ్డి దంపతులకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఉమ్మడి జిల్లాలో మెరుగైన విద్యుత్ సేవలు అందేలా చర్యలు

**- ఎపిఎస్పీడిసిఎల్ ఎస్.ఇ. సురేంద్రనాయుడు**



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతులు, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఎస్పీడిసిఎల్ ఎస్ఇ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక రెస్కో కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయరంగానికి అందించే విద్యుత్‌లో లో ఓల్టేజ్ సమస్య రాకుండా ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే పరిశ్రమలు, ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. లూజ్ లైన్లు ఎక్కడా లేకుండా వాటిని మార్చుతున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సంబంధిత ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామ న్నారు. రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో రీప్లేస్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల కోసం అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఫిర్యాదుల రిజిస్టర్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే విద్యుత్ సమస్యలపై 1912 నెంబరుతో కాల్ సెంటర్ ఏర్పాటుచేశామన్నారు. వీటికి అందే సమస్యలు, ఫిర్యాదులపై వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ నెలలోగా క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి విద్యుత్ లైన్ల సమస్యలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. కుప్పం నియోజకవర్గంలో విద్యుత్ లోడ్ పెరిగిన కారణంగా అదనంగా పది విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రెస్కో ఎండి సోమశేఖర్, డిఇ మదన్ మోహన్ పాల్గొన్నారు.

## శిధిలావస్థలో ఊటువంక రోడ్డు బ్రిడ్జి

**ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి-ఇది నాలుగు దశాబ్దాల పరిస్థితి**



పాకాల, జులై 20 ప్రభాతవార్త : పాకాల మండలం దామలచెరువు రెవెన్యూ గ్రామం ఊటువంక సమీపంలో ఎన్టీఆర్ సప్లై ఛానల్ పై నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించి ఉన్న రోడ్డు బ్రిడ్జి శిధిలావస్థకు చేరుకుంది. ఊరు వారికి వేరే ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఈ మార్గంలోనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ మార్గంలో ఏవైనా బరువైన వాహనాలు తీసుకువెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు ఈ పరిస్థితిని గమనించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిందిగా రైతులు, స్థానికులు కోరుతున్నారు.

## తడ ఎంఎస్ఐకి రివార్డు అందజేసిన తిరుపతి జిల్లా ఎస్పీ



తడ, జూలై 20 ప్రభాతవార్త : ఈ నెల 16న తడలో జరిగిన ఒక హత్యాయత్నం కేసుకు సంబంధించి సకాలంలో బాధితుని ఆసుపత్రికి తరలించి మానవత్వంతో రక్తదానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడిన తడ ఎంఎస్ఐ పి.శ్రీకుమార్‌రెడ్డికి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు శనివారం రివార్డు అందజేశారు. తడలో నివాసం ఉంటూ సమీపంలోని శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న వద్దే సతీష్‌కుమార్ అనే వ్యక్తిపై కాకినాడకు చెందిన రవీంద్రబాబు దాడి చేయడంతో అప్పట్లో తీవ్ర గాయాలయ్యాయి. అయితే తడ పోలీసుస్టేషన్‌లో ఎంఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీకుమార్‌రెడ్డి బాధితుని చికిత్స నిమిత్తం రెడ్‌హిల్స్‌లోని రేలా ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే రక్తం ఎక్కువగా పోవడంతో అతనికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అందించాలని వైద్యులు సూచించారు. దీనితో ఆ రక్తాన్ని స్వయంగా ఇచ్చిన శ్రీకుమార్‌రెడ్డి పెద్దమనసును జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు. ఈ మేరకు ఎస్పీ రివార్డు అందించారు.

## ద్రవిడ వర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కిరణ్‌కుమార్



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త : ద్రవిడ విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వి. కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రస్తుతం ద్రవిడ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగించిన ఉపకులపతి ప్రొఫెసర్ దొరస్వామి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్‌ను విసి ప్రొఫెసర్ దొరస్వామి, వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## రెడ్లరాజ్యంగా మారిన రాయలసీమ

**-బిసి.ఎస్సీవర్గాలను ఎదగనీయలేదు -బిఎస్‌పి రాష్ట్రకోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు**



తిరుపతిటౌన్, జులై 20ప్రభాతవార్త: చారిత్రకంగా రెడ్డిసామాజికవర్గానికి చెందిన నాయకులు, రాయలసీమ నెల్లూరుప్రాంతాల్లో వారి డబ్బు, రాజకీయ పలుకుబడితో బిసి,ఎస్సీ వర్గాలను ఎదగనీయ లేదని బిఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్, విశ్రాంతడిజిపి డాక్టర్ జె.పూర్ణచంద్రరావుఅన్నారు. దీనివల్ల ఎక్కువ శాతం ఉన్న బిసిలు, ఎస్సీలు, మైనార్టీలు రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్రంగా వెనుకబడి,దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. తిరుపతిలో శనివారం బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పూర్ణచంద్ర రావు అధ్యక్షతన జోనల్ సమావేశం జరిగింది. కార్యకర్తలు, నేతలు హాజరయ్యారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలో అటు వైసిపి. ఇటు టిడిపిలో మెజార్టీ స్థానాలు రెడ్లకే కేటాయించడం జరిగిందన్నారు. 2014లో 29మందికి, 2019లో 40మందికి, 2024లో 27మంది రెడ్లకు కేటాయించారన్నారు. దీనివల్ల అత్యధికంగా ఉన్న బిసిలు, ఎస్సీలకు, మైనార్టీలకు ఈ పార్టీలు రాజకీయంగా మనుగడను అందించలేవన్నారు. తీవ్ర ద్రోహం చేస్తున్నాయన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొన్ని కుటుంబాలు మాత్రమే రాయలసీమ, నెల్లూరు ప్రాంతాల్లో రాజ్యమేలుతుండటం బాదాకర మన్నారు. కులగణన ఆలస్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కులగణనతో లాభాలు ఎన్నో ఉన్నా, దానివల్ల కులాల జెండాలతో నడిచే కొన్ని రాజకీయపార్టీల మనుగడకు సవాలు విసురుతున్నాయన్నారు. కులగణనపై ప్రకటనలకే పరిమితంగాక పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో బిఎస్పీ రాయలసీమ కో ఆర్డినేటర్, విశ్రాంత న్యాయమూర్తి పి.గుర్రప్ప, బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కపరం జ్యోతి, ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్, రాయలసీమ జోనల్ కో ఆర్డినేటర్లు జె.మల్లికల్, టి.విజయ కుమార్, జానకిప్రసాద్, సురేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

## అశ్వవాహనంపై అర్జునుని దర్శనం



శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఆవరణలో ఉత్తర గోగ్రహణం కార్యక్రమాల్ని కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి గోవుల్ని ఇక్కడకు తరలించారు. సంప్రదాయ బద్ధంగా గోగ్రహణంను అర్జునవేష ధారి నిర్వహించారు. ఆవుల్ని మలవేసిప అర్జునుని పసిడి అశ్వవాహనంపై ప్రతిష్ఠించి కన్నుల పండువగా పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గా ప్రసాద్‌ల పర్యవేక్షణలో ఉత్సవాల ఇన్‌చార్జి మల్లికార్జున్ ప్రసాద్ వారి సిబ్బంది పర్యవేక్షణలో ఊరేగింపు జరిగింది.ఊరేగింపుతో పాటు ట్రాఫిక్‌కు చెందిన రియాజ్ అహమ్మద్ వారి సిబ్బంది చక్కగా నిర్వహించారు.

## వైష్ణవ కోనేరులో స్నానానికి ఏర్పాట్లు...నీటి సమస్యతో సతమతం



శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవం చివరి రోజు అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు.గతంలో ఈ కార్యక్రమాలకు ఏడు తీర్థాల్లో స్నానమాచరించే వారని ప్రతీతి. అయితే నేడు అన్ని తీర్థాలు ఆక్రమణలకు గురయ్యాయి. సువర్ణముఖిమాత్రమే మిగిలింది. అయితే సువర్ణముఖి నదిలో నీరు అంతంత మాత్రంగా ఉంది. గతంలో చలము ఏర్పాటు చేసి గెరిగేను స్నానమాచరింపజేసే వారు. కానీ నేడు ఆ సదుపాయం కూడా లేదు.అయితే సమీపంలోని వైష్ణవ కోనేరు ఎంతో ఉపయోగపడుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ దశల వారిగా స్నానాలకు సదుపాయాలు కల్పిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం టాంకర్లకే స్ప్రింకర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి ఆదివారం ఎంత వరకు భక్తుల అవసరాన్ని తీరుస్తాయనేది వేచి చూడాలి. దాంతో వారి సూచనలతో ఆలయాధికారులు పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ దక్షిణం వైపు 20కోళాయిల్ని ఏర్పాటు చేశారు.దానికి మోటారు ఏర్పాటు చేశారు. ఓ వైపు మహిళలు మరో వైపు పురుషులు స్నానమాచరించటానికి ఏర్పాట్లు చేశారు. కోళాయిల వద్దనే స్నానమాచరించాల్సి ఉంటుంది. సాధారణంగా ఐదారువేల మంది అగ్నిగుండంలో ప్రవేశిస్తారు. మరి 20కోళాయిల ఏర్పాటు సరిపోతుందా? అని చర్చించుకుంటున్నారు. చుట్టూ ఓ వంద కొళాయిలు ఏర్పాటు చేసి ఉంటే కొంత వరకు ఉపయోగకరంగా ఉండేదని భావిస్తున్నారు. అయితే కోనేరులో నీరే లేదు. ఎన్ని కొళాయిలు ఏర్పాటు చేసినా ఏం ప్రయోజనం అని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా సెక్యూరిటీని నియమించారు. శనివారం ఇక్కడ భక్తులు కంకణాలు ధరించి పసుపు బట్టలతో స్నానమాచరించటం కనబడింది.

## ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జులై 20 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారు జాము, నగరంలో పారిశుద్ధ్య పనులను, పార్కుల నిర్వహణను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కార్పొరేటర్ ఆరణి సంధ్య ప్రజా ఫిర్యాదుల వేదికలో ఇచ్చిన వినతుల మేరకు ఎంఆర్ పల్లి కూడలి, వైకుంఠపురం ఆర్చి, పార్కు, ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్, న్యాయవాదుల కాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్, తదితర ప్రాంతాల్లోని డ్రైనేజీ కాలువలు, త్రాగునీరు సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెద్ద సంఖ్యలో ప్రజలు వినతులు ఇస్తున్నారని, వాటిని అన్నింటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించామని అన్నారు. అలాగే మెజర్‌గా ఉన్న సమస్యలను తానే స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని అన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ముఖ్యంగా డయేరియా ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. త్రాగునీటి సాంద్రత పరీక్షలు, అంగన్‌వాడి కేంద్రాల్లో వడ్డించే ఆహారంలో పరీక్షలు ప్రతి రోజూ నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా నగరంలో అన్ని డ్రైనేజీ కాలువల్లో చెత్త తొలగింపు కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. ప్రజలు కూడా రోడ్లపైనే, కాలువల్లో చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వస్తున్న తమ సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని అన్నారు. వైకుంఠపురం పార్కుల్లో గ్రీనరీ పెంచాలని, ఆట వస్తువుల మరమ్మత్తులు చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ మహేష్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, డిసిపి శ్రీనివాసులు, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సుమతిలు ఉన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధన : జిల్లా విద్యాశాఖాధికారి



తొట్టంబేడు, జూలై 20 ప్రభాతవార్త : ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా శాస్త్రీయ పద్ధతుల్లో విద్యాబోధన జరపాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. పట్టణంలోని ఆర్‌పిబిఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ సాధన శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమానికి బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్య పాళెం, కెవిబిపురం, వెంకటగిరి, డెక్కలి, పెళ్ళకూరు, బాలాయపల్లి, తొట్టంబేడు మండలాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిఆర్పీలు హాజర య్యారు. ఈసందర్భంగా డిఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ స్వీయ పథకంలో భాగంగా ప్రధానోపా ధ్యాయులు తమ పరిధిలోని పరిశీలన చేయాలన్నారు. పరిశీలన ఉద్దేశ్యం, వాతావరణం, సామాజిక భావోద్వేగ నైపుణ్య పద్ధతిలో సాగాలన్నారు. విద్యార్థులు నైపుణ్యం తరగతి బోధన వంటి అంశాలను శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించాలన్నారు. పరిశీలించిన అంశాలను టీచ్ టూల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. శిక్షణానంతరం ఈ విద్యాసంవత్సరంలో వారికి మ్యాప్ చేసిన 40 పాఠశాలలను పరిశీలించాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎంఓ శివశంకరయ్య, అసిస్టెంట్ ఏఎంఓ మధు, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, సిఆర్పీలు పాల్గొన్నారు.

## శాకాంబరి అలంకారంకు ముస్తాబైన కాణిపాకం

**-15 టన్నుల కూరగాయాలు విరాళం**



కాణిపాకం, జూలై 20 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాయలంలు ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి జరుగనున్న శాకాంబరి అలంకారంకు ముస్తాబయ్యాయి. 2022 నుండి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమనికంఠేశ్వరాలయంలో శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహిస్తున్నారు. ఈఏడాది ప్రధాన ఆలయంలో కూడా శాకాంబరి అలంకారం నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు అలంకరణకు అవసరమైన కూరగాయలను భక్తులు ఉచితంగా సమర్పించాలన్న విజ్ఞప్తితో భక్తులు వారికి తోచిన విధంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లును విరాళంగా దేవస్థానంకు అందజేశారు. దీనితో భక్తులు విరాళంగా అందజేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయం, మణికంఠేశ్వరాలయంలను సరా ్వంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఈఆలయాల ప్రాంగణం మొత్తాన్ని కూరగాయలు, పండ్లుతో అలంకరిస్తున్నారు. వేకువ జామున అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం కూరగాయలు, పండ్లుతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

**15 టన్నుల కూరగాయలు విరాళం:**



కాణిపాకం దేవస్థానంలో ఆదివారం జరుగనున్న శాకాంబరి అలంకారంకు కావలసిన కూరగాయాలు, పండ్లును విరాళంగా అందించాలన్న ఆలయ అధికారుల విజ్ఞప్తితో దాతలు పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణశెట్టి, బాబురెడ్డి, శ్రీవారి సేవకుల బృందం అలంకారంకు 15 టన్నుల వివిధ రకాల కూరగాయలను విరాళంగా ఆలయానికి అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండ పాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.